సాక్షి
జనగామ

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



శబరిమలకు ప్రత్యేక రైళ్లు

వరంగల్ మీదుగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸



అవినీతి రూపం మారుతోందా?

కొంతమంది అధికారులు ప్రజల నుంచి అవినీతి సొమ్మును నేరుగా తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బంది నుంచి తీసుకుంటున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
28^0 /19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సోమేశ్వర ఆలయంలో పీఠాధిపతి పూజలు



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబ్రహ్మానంద సరస్వతికి అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖమంటపంలో శివకేశవుల తత్వ ప్రవచనం చేశారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి



జనగామ రూరల్: రాష్ట్ర జనాభాలో ఎక్కువగా ఉన్న బీసీలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర వీరస్వామి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీసీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలందరూ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులుగా పోటీ చేయాలన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షుడిగా మారబోయిన శ్రీనివాస్‌ను ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుర్రాల సురేష్, ఉపాధ్యక్షుడు నిమ్మల కుమారస్వామి, యువజన విభాగం అధ్యక్షుడు పండుగా హరీష్, కార్యదర్శి పిట్టల రజనీకాంత్, లింగాలఘణపురం కార్యదర్శి దూసరి శంకర్, రాజు, యాకన్న, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



జనగామ రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించి తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో 5వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మాణిక్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక గ్యారంటీలను హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది సంబురాలు జరుపుతున్నారని విద్యారంగ సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఉన్న బడులను బాగు చేయాల్సిన అవసరాన్ని పక్కన పెట్టి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో మరో కొత్త బడులకు శ్రీకారం చుట్టారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, ఉపాధ్యక్షురాలు తాళ్లపెల్లి హేమలత, కోశాధికారి తాడూరి సుధాకర్, జిల్లా కార్యదర్శులు యాదవరెడ్డి, చిక్కుడు శ్రీనివాస్, మడూరి వెంకటేష్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల (అటానమస్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల రెండో సంవత్సరం మూడో సెమిస్టర్, మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్ని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ విడుదల చేసినట్లు ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 458 మంది విద్యార్థులకుగాను 453 మంది పరీక్షలు రాయగా.. వారిలో 332 మంది (73.29 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్ పరీక్షలకు 412 మంది పరీక్షలకు హాజరు కాగా అందులో 340 మంది (82.52 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు చంద్రమౌళి తెలిపారు.

ముగిసిన డేటా ఎంట్రీ

- మిగిలిన కుటుంబాలకు మరో చాన్స్
- ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్
- 20 రోజుల పాటు కొనసాగిన ప్రక్రియ



డేటా ఎంట్రీ చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

జనగామ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసింది. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో ఆయా శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఇంటింటా సర్వే విజయవంతంగా సాగింది. నవంబర్ 6 నుంచి 8 వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్ వేసిన అధికారులు.. 9వ తేదీ నుంచి 21వ తేదీ వరకు సర్వే పూర్తి చేశారు. జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసి కలెక్టర్‌తో రివ్యూలు నిర్వహించారు. సర్వే సమయంలో ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లడంతో విజయవంతంగా ముగించారు.

1,77,044 ఇళ్లలో సర్వే..

జిల్లాలోని 12 మండలాలతోపాటు జనగామ అర్బన్ కలుపుకుని 1,77,044 ఇళ్లలో సర్వే చేయగా.. రెండు రోజుల క్రితం వందశాతం డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసింది. రూరల్ ఏరియాలో 1,61,355, అర్బన్‌లో 15,689 ఇళ్లలో కుటుంబాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఇందుకు 1,350 బ్లాక్‌లను ఏర్పాటు చేయగా.. 1,669 ఎన్యుమరేటర్లు పని చేయగా, 184 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేశారు. ఒక్కో కుటుంబానికి 75 ప్రశ్నల చొప్పున పార్ట్ -1, 2 కేటగిరీలు విభజించి, కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను సమగ్రంగా నమోదు చేశారు. నవంబర్ 23 నుంచి జిల్లా వ్యాప్తంగా కుటుంబ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించారు. జనగామ కలెక్టరేట్-85, బచ్చన్నపేట-20, దేవరుప్పుల-35, నర్మెట-20, పాలకుర్తి -15, శ్రీస్తుజ్యోతి-30, లింగాలఘణపురం-30, చిల్పూరు-25, స్టేషన్‌ఘన్‌పూర్-35, కొడకండ్ల-25, రఘునాథపల్లి-40, జఫర్‌గఢ్-25 కంప్యూటర్లను ఏర్పాటు చేసి ఈ-డిస్ట్రిక్ మేనేజర్ గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో డేటా ఎంట్రీని పూర్తి చేశారు.

కుటుంబ సర్వే, డేటా ఎంట్రీ వివరాలు..
నవంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్
నవంబర్ 9 నుంచి 21వ తేదీ వరకు ఇంటింటి
సర్వే పూర్తయిన ఇళ్లు: 1,77,044
డేటా ఎంట్రీ పూర్తయిన గృహాలు: 1,77,044
బ్లాక్‌లు: 1,350
ఎన్యుమరేటర్లు: 1,669
సూపర్ వైజర్లు: 184

తప్పులు లేకుండా..

ఇంటింటా సేకరించిన కుటుంబ సర్వే వివరాలను డేటా ఎంట్రీ చేసే సమయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డేటా ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ చేశారు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఎన్యుమరేటర్ల పర్యవేక్షణలో ఎంట్రీ చేయగా, తప్పులు దొర్లకుండా ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తర్వాత సబ్మిట్ చేశారు.

ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్

జిల్లాలో కుటుంబ సర్వే ముగిసినప్పటికీ ఆయా మండలాలు, అర్బన్‌లో కొన్ని చోట్ల పలు కుటుంబాలకు సంబంధించి సర్వే పెండింగ్ ఉన్నాయి. ఎన్యుమరేటర్లు ఇంటికి వెళ్లిన సమయంలో తాళం వేసి ఉండడం తదితర కారణాలతో పాటు వలస వెళ్లిన వారు కొంతమంది ఉన్నారు. ఆ కుటుంబాలకు మరో అవకాశం ఇచ్చారు. మండలాల పరిధిలో ఎంపీడీఓ, అర్బన్‌లో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. సర్వేలో మిగిలిన కుటుంబాలు అక్కడకు వెళ్లి తమ వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రతీ కుటుంబం సర్వేలో పాల్గొనాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో మిగిలిన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

డేటా ఎంట్రీ ముగిసింది..



జిల్లాలో కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసింది. కలెక్టరేట్‌తో పాటు మండలపరిషత్, తహసీల్దార్, కళాశాలలు, కంప్యూటర్లు అందుబాటులో ఉన్న చోట డేటా ఎంట్రీ చేయించాం. ఎక్కడ కూడా తప్పులు దొర్లకుండా పర్యవేక్షణ చేశాం. కుటుంబ సర్వే సమయంలో మిగిలిన కుటుంబాలు మండలాల పరిధిలో ఎంపీడీఓ, అర్బన్‌లో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

సంక్షేమానికి ఏడాది!

- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం.. రైతులకు రుణమాఫీ
- నిరుద్యోగులకు ఉద్యోగాలు.. ఉచిత విద్యుత్
- ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- నేటితో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది పూర్తి



జనగామ ఆర్టీసీ డిపోలో మహిళలకు ఉచిత ప్రయాణం టికెట్ ఇస్తున్న అధికారులు (ఫైల్)

జనగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించుకుంటోంది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బాధ్యతలు చేపట్టి నేటికి (సోమవారం) ఏడాది పూర్తి చేసుకుంటోంది. ఎన్నికల సమయంలో మహాలక్ష్మి, యువ వికాసం, రైతు భరోసా, వరి పంటకు రూ.5వందల బోనస్, చేయూత స్కీం, గృహజ్యోతి పథకం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో పాటు ప్రజా అవసరాలకు తగ్గట్టుగా తమ పరిపాలన ఉంటుందని భరోసా కల్పించారు. దీంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల మేరకు అర్హులైన వారికి పథకాలను వర్తింపజేస్తున్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, డీఎస్సీ, గ్రూప్- 1, 2, 3, 4 ద్వారా వందలాది మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పిస్తోంది. 317 జీఓ ద్వారా మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించగా, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

ఆర్టీసీలో జోష్..

12 నెలల కాలంలో ఇప్పటి వరకు జనగామ డిపో పరిధిలో 1.29 లక్షల మందికి పైగా ఉచితంగా ప్రయాణం చేయగా, రూ.61.57 కోట్ల మేర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించింది. రోజువారీగా 37,805 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణం చేయగా, రూ.18 లక్షల వరకు టికెట్ కలెక్షన్లు వచ్చాయి. అలాగే జిల్లాలో 1.67లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, 86,430 మంది వినియోగదారులకు రూ.5వందల చొప్పున సిలిండర్లు అందిస్తున్నారు.

87,877 మందికి ఉచిత కరెంట్

జిల్లాలో 1,37,989 విద్యుత్ కనెక్షన్లు ఉండగా గృహజ్యోతి పథకంలో 87,877 మంది వినియోగదారులకు 200 యూనిట్ల చొప్పున ఉచితంగా అందించారు. ఇప్పటి వరకు రూ.21.87కోట్ల లబ్ధి చేకూరగా ఈ మొత్తం ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే రుణమాఫీలో భాగంగా జిల్లాలోని 54,548 మంది రైతులకు రూ.469.32 కోట్ల మేర మాఫీ కాగా, ఇంకా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుంది.

సైన్స్ మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 252 ఎగ్జిబిట్ల ప్రదర్శన

జనగామ రూరల్: నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సైన్స్ మేళాకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ రమేశ్, సైన్స్ అధికారి సీహెచ్ ఉపేందర్ తెలిపారు. పట్టణంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో 9, 10 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులతో ఇన్‌స్పైర్, వైజ్ఞానిక మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పైర్‌లో భాగంగా 252 ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇది చక్కటి వేదిక అని, భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగడానికి, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించే విధంగా ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

ఏడాదిలో 55వేల ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసింది
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

మడికొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలను భర్తీ చేసిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మడికొండ శివారులోని ఓ కన్వేషన్ హాల్‌లో జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే డీఎస్సీ ద్వారా 11వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. కాళేశ్వరం నుంచి నీటిని ఉపయోగించకుండా 1.53 మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేస్తున్న విషప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, డిగ్రీ కళాశాల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ కార్యాలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను రేవంత్‌రెడ్డి బయటకు తీస్తుంటే వారికి భయం పుట్టుకుందన్నారు. అనంతరం వివిధ మండలాలకు కొత్తగా ఎంపికైన కాంగ్రెస్ పార్టీ నాయకులను, నామినేటెడ్ పోస్టులను పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, హజ్ కమిటీ అధ్యక్షుడు ఖుస్రుపాషా, నాయకులు అమృతరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవ సన్నిధిలోనే మానసిక ప్రశాంతత

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: ఒత్తిడితో కూడిన జీవనంలో దైవారాధనతో ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత చేకూరుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పల్లెప్రకృతి వనం సమీపంలోని గుట్టపై నిర్మించే అయ్యప్ప ఆలయ నిర్మాణానికి వేదపండితుడు గౌతంశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఆరాధ్యదైవాన్ని ఆరాధిస్తూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. స్థానిక అయ్యప్ప స్వాములు, భక్తులు అయ్యప్ప ఆలయ నిర్మాణ సంకల్పంతో ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణ భూమి పూజకు హాజరై సహకరించిన ఎమ్మెల్యేను అయ్యప్ప స్వాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, నాయకులు మధుసూదన్, యాకేష్, వెంగల్‌రావు, మోహన్, గురుస్వాములు శ్రీపాద అంజనేయచారి, సోమేశ్వర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సమస్యకు భగవద్గీతలో పరిష్కారం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణమాచార్య

జనగామ: సమస్త మానవాళి జీవన విధానంలో ఎదురయ్యే ప్రతీసమస్యకు భగవద్గీత పరిష్కారం చూపిస్తుందని బాణాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆస్థాన సిద్ధాంతి కృష్ణమాచార్య అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక బాణాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రాంరెడ్డి కృష్ణ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో భగవద్గీత బోధన తప్పనిసరి చేయాలన్నారు. గీతా మతగ్రంథం కాదని, మానవాళి జీవితానికి మార్గదర్శి, దిక్సూచి అన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న 70 మంది విద్యార్థులను గీతా శ్లోకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జనగామ నిర్వాహకులు గునిగంటి రామకృష్ణ, బిక్కి అలివేణి మంగ, లావణ్య, కుమార్, ఆచార్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఊరూరా ఇసుక దందా!

- బహిరంగంగా సాగుతున్నా.. షరా 'మామూలే'
- టేకుమట్ల, చిట్యాల, రేగొండలో విచ్చలవిడి..
- దుమ్మురేపుతున్న ట్రాక్టర్లు.. హడలిపోతున్న జనాలు
- ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా వాగుల్లో ఇసుక దందా

ఫోకస్ సాక్షి ఫోకస్



కలికోట శివారు మానేరు వాగులో తవ్వుతున్న ఇసుక



మొగుళ్లపల్లి పరిధి వాగులో..

సాక్షిప్రతినిధి, వరంగల్ : జడలు విప్పుతున్న ఇసుక మాఫియాను అరికట్టాల్సిన ప్రభుత్వశాఖల అధికారులు కొందరు 'మామూలు'గా తీసుకుంటున్నారు. సమన్వయంతో పనిచేయాల్సిన పోలీసు, పంచాయతీరాజ్, అటవీ, రెవెన్యూ, టీజీఎండీసీ, ఇరిగేషన్, మైనింగ్ తదితర శాఖలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నదీతీరాలు, వాగుల్లోనుంచి రాత్రనక, పగలనక యథేచ్ఛగా ఇసుక తవ్వుతున్నారు. 'మాఫియా'గా అవతారమెత్తిన వ్యాపారులు ఈ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సమీప పట్టణాలు, నగరాల్లో డంప్ చేసి హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు లారీలు, టిప్పర్ల ద్వారా తరలించి విక్రయిస్తున్నారు.

వాగులు తోడేస్తున్న అనకొండలు..

జేఎస్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట, వెంకట్రావుపల్లి ఇసుక దందాకు ప్రధాన అడ్డాగా మారాయి. ట్రాక్టర్ల స్పీడు, తాకిడికి విసిగి వేసారిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఒక్కటై ఇటీవల ఫిర్యాదు చేస్తే.. గంటలో పోలీసులు 8 లారీలను పట్టుకుని సీజ్ చేశారంటే దందా ఏ స్థాయిలో జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. చిట్యాల మండలం నవాబుపేట శివారులోని చలివాగు, మొగుళ్లపల్లి మండలం పెద్దవాగు నుంచి తవ్వుతున్నారు. అనుమతుల మాటున కొన్నయితే.. అనధికారికంగా, అక్రమంగా మరికొన్ని చోట్ల తవ్వకాలు చేపడుతూ రేగొండ మండలం దమ్మన్నపేట ద్వారా పరకాలకు తరలిస్తున్నారు. డిమాండ్, దూరాన్ని బట్టి ట్రాక్టరుకు రూ.3,500 నుంచి రూ.10వేల వరకు.. లారీ అయితే కెపాసిటీని బట్టి సుమారు రూ.38 వేల నుంచి రూ.55 వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. టేకుమట్ల, చిట్యాల, రేగొండ మండలాల పరిధి గ్రామాల ప్రజలు ఇసుక ట్రాక్టర్లు, లారీల స్పీడుకు భయాందోళనలకు గురవుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినా.. విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కిరణ్‌ఖరే పలుమార్లు హెచ్చరించినా స్థానికంగా పర్యవేక్షణ లేక అక్రమాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా సొంత అవసరాలకు ప్రజలు ఇసుకను తీసుకుంటే ఇబ్బంది పెట్టవద్దని ఓ ప్రజాప్రతినిధి అధికారులకు చేసిన సూచనను ఆసరాగా చేసుకుని దందా చేసే వ్యాపారులు సైతం అధికారుల వద్ద ఆయన పేరునే వాడుకుంటుండటం కొసమెరుపు.

ఉమ్మడి జిల్లాలో ఇదే తీరు..

ఉమ్మడి వరంగల్‌లోని మున్సిపాలిటీలు, పట్టణాల్లో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.

మహబూబాబాద్ జిల్లాలోని పలు ఏజెన్సీ మండలాల్లో గిరిజనేతరులు ఇసుక అమ్మకానికి అనుమతి ఉండదు. గూడూరు లాంటి చోట కూడా గోదావరి ఇసుక పేరుతో అమ్మకాలు సాగుతున్నాయి. ఆకేరు, మున్నేరు వాగుల నుంచి ఇసుక తరలింపును నిషేధించినా కొందరు రాత్రి వేళ వాగుల నుంచి తెస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి వస్తోందంటూ రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు, మునిగలవీడు గ్రామాల శివారు ఆకేరు వాగు నుంచి అర్ధరాత్రి రవాణా కొనసాగుతోంది. గూడూరు మండలం కొల్లాపురం శివారు మున్నేరు వాగును కూడా వదలిపెట్టడం లేదు. టీఎస్ఎండీసీలో రిజిస్టర్ అయిన లారీల యజమానులు, డ్రైవర్లతో కుమ్మక్కై తప్పుడు పత్రాలతో వరంగల్ జిల్లా నర్సంపేటలో 25 మందికి పైగా ఇసుకను తెప్పించుకుంటూ డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి 6 వేల వరకు విక్రయిస్తున్నారు.

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఆకేరు వాగులో ఇసుక దందా జోరుగా సాగుతోంది. ఎల్కతుర్తి, పరకాల మండలాల్లోనూ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం పరిధిలోని కొత్తపల్లి, ల్యాబర్తి, కట్రాల గ్రామాల్లో ఆకేరు వాగు పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పట్టా భూముల్లో కొన్నేళ్లుగా మట్టిని ఇసుకగా మార్చే దందా సాగుతోంది.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ఓ కాలనీలో ఏకంగా 60 ట్రాక్టర్లు ఇసుక అక్రమ రవాణా కోసమే పనిచేస్తున్నాయి. రఘునాథపల్లి మండలానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ ప్రాంతంలోని ఇసుక, మట్టి దందా నాయకుల గురించి ఇటీవల పోలీసులకు పదికి పైగా ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. పాలకుర్తి, జనగామల చుట్టూ కూడా ఇసుక అక్రమ దందా సాగుతోంది.

నాయకుల ఇష్టారాజ్యం..



పెద్దవాగు, చలివాగు పరీవాహక గ్రామాల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా బడా నాయకులు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇసుక అక్రమ తరలింపు వల్ల ఇబ్బందులను కూడా ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి.

- పంచనేని సంపత్‌రావు, పోతుగల్లు

సహజ వనరులను కాపాడాలి



ఇదివరకు అధికారుల అనుమతితో ఇంటికి సరిపడా ఇసుక మాత్రమే తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమ తవ్వకాలే. కొందరు అక్రమార్కులు నిరంతరం దందా చేస్తున్నారు. చలివాగులో ఇప్పటికే నీటి ధార తగ్గింది. ఇలాగే ఇసుక తోడితే ఎండాకాలంలో తాగునీటికి కష్టాలు ఎదుర్కోవాల్సిందే. సహజ వనరులను కాపాడాలి.

- ఎండీ.అఫ్జల్, వెలిశాల(టేకుమట్ల)

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు..



మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవు. ఇసుక రవాణాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యాయి. ఇసుక అక్రమ రవాణా చేస్తే కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ తగిన చర్యలు తీసుకుంటాం.

- సునీత, తహసీల్దార్, మొగుళ్లపల్లి

వ్యాయామ ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ అవకాశం ఇవ్వాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

జనగామ రూరల్: వ్యాయామ ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ బీపీఈడీకు అవకాశం ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు గోరుసింగ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీఎం కప్పు వేసవి సెలవుల్లో సేవలందించిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఎర్న్డ్ లీవులు మంజూరు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా జాటోత్ గోర్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి మనోజ్ కుమార్, కొండ రవి, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కిషన్, రవికుమార్, కిష్టయ్య, సైదులు, మాధవి, సుధారాణి, సంగీత మాధురి, రవీంద్ర ప్రసాద్, సుభాష్, రాము, దిలీప్, నరేష్, గుణవర్ధన్, ఉపేందర్, రంజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

- టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్




శ్రీధర్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–327 బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో ఇనుగాల శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు టీఎస్ఈఈయూ–327 నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నేత శ్రీధర్ అన్నారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకు యూనియన్ నాయకత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అంతకు ముందు బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, జనరల్ సెక్రటరీ పి.రాజిరెడ్డి, ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సీహెచ్. నరేందర్ రెడ్డి, ఎం.సత్యనారాయణ, తులసీ శ్రీమతి, చిట్ల ఓదెలు, మచ్చిక బుచ్చయ్య గౌడ్, గుండా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్‌తో ఏఆర్ కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన?

- జిల్లా పోలీసు కార్యాలయంలో ఘటన



భూపాలపల్లి: స్వీపర్ పనులు చేసే ఓ మహిళతో ఏఆర్ కానిస్టేబుల్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో పని చేసే ఓ మహిళా స్వీపర్ రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం గదులు శుభ్రం చేస్తుండగా ఓ ఏఆర్ కానిస్టేబుల్ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, సదరు కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై భూపాలపల్లి సీఐ డి. నరేశ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా 'తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని' తెలిపారు.

అవినీతి రూపం మారుతోందా?

దాడులు జరుగుతున్నా అధికారుల్లో భయం లేదు!

- ఈ సంవత్సరం 18 ఏసీబీ కేసులు
- నేటితో ముగుస్తున్న అవినీతి నిరోధక శాఖ వారోత్సవాలు

వరంగల్ క్రైం : ప్రజలకు హక్కుగా అందాల్సిన సేవలు ఖర్చుతో ముడిపడుతున్నాయి. సర్టిఫికెట్లు, బీమా సొమ్ము, పింఛన్లు.. ఇలా అనేకం ప్రభుత్వం నుంచి పొందడానికి అధికారులకు చెయ్యి తడిపితే తప్ప పొందలేని భయంకర పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం నెలనెలా ప్రభుత్వ అధికారులకు వేతనాలు చెల్లిస్తుంది. అయినా అధికారుల్లో అవినీతి రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ క్రమంలో ఏటా అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు పెరుగుతున్నా ఇతర అధికారుల్లో మాత్రం భయం లేకుండా పోయింది. రిజిస్ట్రేషన్, ఆర్‌టీఏ, ఇంజనీరింగ్ శాఖలు, రెవెన్యూ.. ఇలా కొన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

ప్రైవేట్ వ్యక్తుల ద్వారా లంచం..

అవినీతి నిరోధక శాఖ అధికారుల కంటే అవినీతిపరులు ఆలోచనలు ఎక్కువగా పనిచేస్తున్నాయి. ప్రజల నుంచి అవినీతి సొమ్మును నేరుగా తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బంది, డ్రైవర్లు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి తీసుకుంటున్నారు. కొంత మంది అధికారులు పెట్రోల్ బంకులు, హోటళ్లు, జిరాక్స్ సెంటర్లు, టీవీ షాపుల్లో బిల్లులు చెల్లించుకుంటున్నారు. ఇలా బిల్లులు చెల్లించి అధికారుల పేరు మీద రసీదులు తీసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో ఏసీబీ అధికారుల కూడా ఇలాంటివి చాలెంజ్‌గా మారాయి.

వలలో చిక్కిన అవినీతి అధికారులు వీరే..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో 18 మంది ఇతర శాఖల అధికారులు పడ్డారు. వీరిలో 15 మంది లంచం తీసుకుని పట్టుబడగా, ముగ్గురు అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి పట్టుబడ్డారు.
- ఈ ఏడాది జనవరి 5న కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సింగారపు కిష్టయ్య పాలు, పెరుగు సప్లయ్ చేసే వ్యాపారి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- జనవరి 11న జనగామ డీఎంహెచ్ఓ షేపురి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ అజార్‌ఖాన్ రఘునాథపల్లి పీహెచ్‌లో ఫార్మసిస్టుకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చేందుకు రూ.50 వేల లంచం పుచ్చుకుంటూ పట్టుబడ్డారు.
- మార్చి 22న మహబుబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, డేటా ఎంట్రీ వెంకటేశ్.. ఓ రిజిస్ట్రేషన్ విషయంలో రూ.19,200 లంచం తీసుకుని పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 15న హుజూరాబాద్ డిపో మేనేజర్ సామాల శ్రీకాంత్ ఓ ఉద్యోగి చార్జిషీట్ తీసివేయడానికి రూ. 20 వేల లంచలం తీసుకుంటూ దొరికిపోయాడు.
- మే 20న ఓ రైతు నుంచి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.5వేలు లంచలం తీసుకుంటూ పాలకుర్తి తహసీల్దార్ మాధవి, కంప్యూటర్ ఆపరేటర్ జనగాని రాజేశ్ చిక్కారు.
- జూలై 9న రఘునాథపల్లి మండలం కాచపల్లి పంచాయతీ కార్యదర్శి పాకిడే శివాజీ డీజిల్ బిల్లుల చెల్లింపుల కోసం రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- జూలై 25న ఓ రిజిస్ట్రేషన్ విషయంలో రైతు నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటూ పరకాల సబ్ రిజిస్ట్రార్ కందాల సునీత, డాక్యుమెంటరీ రైటర్ దొరికారు.
- ఆగస్టు 2న ఓ కేసు విషయంలో అరెస్టు చేయకుండా ఉండేందుకు పర్వతగిరి ఎస్సై వెంకన్న, కానిస్టేబుల్ పసునూరి సదానందం రూ. 20 వేల లంచం తీసుకుంటూ చిక్కారు.
- ఆగస్టు 12న పాలకుర్తి మండలం గుడికుంట తండా జీపీ స్పెషల్ అధికారి, ఏఈ గుగులోత్ టోపల్ ఓ బిల్లు చెల్లింపు కోసం రూ. 6 వేలు లంచం తీసుకుని పట్టుబడ్డాడు.
- ఆగస్టు 18న గుంజేడు ముసలమ్మ జాతర గుడి మేనేజర్ బోగోజు భిక్షమాచారి జాతరలోని కూల్‌డ్రింక్ షాపు యాజమాని నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- ఆగస్టు 31న స్టేషన్‌ఘన్‌పూర్‌లో 33కేవీ లైన్‌ను మార్చడానికి టీజీఎన్పీడీసీఎల్ డీఈ మాలోత్ హుస్సేన్ నాయక్ రూ. 20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- సెప్టెంబర్ 27న జనగామ జిల్లాలో కొత్త పెట్రోల్ పంపు ఎన్‌ఓసీ అనుమతి కోసం రూ. 14 వేలు లంచం తీసుకుంటూ ఆర్అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుస్సేన్, జేఏ అవాల రవీందర్ పట్టుబడ్డారు.
- అక్టోబర్ 24న భూపాలపల్లి జిల్లా తాడిచర్ల జీపీలో సీసీ రోడ్డు బిల్లు చెల్లింపుకోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ శాఖ ఈఈ సంపతి దిలీప్‌కుమార్, టెక్నికల్ అధికారి తావాల చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వలపాదాసు శోభారాణి పట్టుబడ్డారు.
- నవంబర్ 21న సమాచార హక్కు చట్టం కింది అడిగిన భూ వివరాల కోసం రూ.20 వేల లంచం తీసుకుంటూ కలగాని జ్యోతికేశ్మబాయ్ మహబుబాబాద్‌లో చిక్కారు.
- నవంబర్ 28న సీసీ రోడ్డు బిల్లు చెల్లింపు కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ ఏఈ గాదె కార్తీక్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.



అవినీతి వ్యతిరేక ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా (ఫైల్)

ముగుస్తున్న వారోత్సవాలు...

అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా సంబంధిత శాఖ డిసెంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం, అవినీతి పరులను పట్టించిన ప్రజలను సన్మానించడం వంటి కార్యక్రమాలు చేపడుతుంది. అయినా అవినీతి అధికారుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది.

ఏసీబీ దాడులు ఇలా..

సంవత్సరం	కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	18

ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన కేసులో..

ఈ ఏడాది మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ అధికారి పాలాం సునీత, ఏప్రిల్ 22న మహబుబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, మహబుబాబాద్ డీటీఓ గౌస్‌పాషాతో పాటు మరో నలుగురు ప్రైవేట్ వ్యక్తులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి.

ట్రోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయండి



హక్కుగా లభించాల్సిన సేవల కోసం ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. ప్రజలు లంచం ఇవ్వడం కూడా తప్పిదమే. ఏ అధికారి లంచం అడిగినా ఫిర్యాదు చేసి పట్టించాలి. ప్రభుత్వ అధికారుల నుంచి వేధింపులు కలిగితే వరంగల్ ఏసీబీ డీఎస్పీ 9154388912 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

–పి.సాంబయ్య, ఏసీబీ డీఎస్పీ, వరంగల్

10న అండర్–14 జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖాంత్ మైదానంలో ఈ నెల 10వ తేదీన అండర్–14 ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ పరిధిలో జరగనున్న పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు సెప్టెంబర్ 1, 2010 నుంచి 31 ఆగస్టు 2012 మధ్య జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు మీసేవ ద్వారా జారీ చేసిన నూతన జనన ధ్రువీకరణ పత్రం, స్కూల్ నుంచి బో నోఫైడ్, సొంత క్రికెట్ కిట్టుతో ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు. ఈ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులుగా అఫ్జల్, రామకృష్ణ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9849570979 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫాం హౌస్ వాచ్‌మెన్ ఆత్మహత్య

గీసుకొండ: గీసుకొండ మండల కేంద్రంలోని ఓ ఫామ్ హౌస్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మంద పెద్దులు(65) కొంత కాలంగా గీసుకొండ పరిధిలోని మహ్మద్ ఫిరోజ్ ఫాం హౌస్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అందులో గీసుకొండకు చెందిన ఓ మహిళ కూలీగా పని చేస్తుండగా వారిద్దరు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన వారిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో పెద్దులు ఫాం హౌస్‌లో పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు మంద రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

వరంగల్ క్రికెట్ సంఘం ఎన్నికల్లో చాగంటి ప్యానల్ విజయం

- అధ్యక్షుడిగా పెద్ది ప్రవీణ్, కార్యదర్శిగా చాగంటి శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్ఓ సమ్మిరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధంగా కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా చాగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. రెండు ప్యానళ్ల మధ్య జరిగిన పోటీలో చాగంటి శ్రీనివాస్ ప్యానల్ ఏకపక్షంగా పోటీ చేసిన అన్నీ పదవులను గెలుచుకుంది. అధ్యక్షుడిగా పెద్ది ప్రవీణ్‌గౌడ్ 35 ఓట్లు సాధించి గెలుపొందారు. ప్రత్యర్థి ఖాజా జమీర్‌కు 9 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా చాగంటి శ్రీనివాస్‌కు 32 ఓట్లు రాగా, ప్రత్యర్థి విద్యాసాగర్‌కు 12 ఓట్లు పోలయ్యాయి. దీంతో శ్రీనివాస్ విజయం సాధించారు. అలాగే, శ్రీనివాస్ ప్యానల్‌లో పోటీలో నిలిచిన ఉపాధ్యక్షులుగా అచ్చ వెంకటేశ్వర్‌రావు, రఘురాం, నజీమ్, సంయుక్త కార్యదర్శిగా ఉపేందర్, కోశాధికారిగా, కే. శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వేణుగోపాల్, అభినవ్‌వినయ్‌కుమార్, బస్వరాజు శ్రీమాన్, ఇనాయత్ గెలుపొందారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపు సమ్మిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గం 2024 నుంచి 2027 వరకు కొనసాగుతుందని తెలిపారు.

డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ దుర్మరణం

- ప్రమాదాన్ని తప్పించే క్రమంలో చెట్టును ఢీకొన్న వాహనం



లక్ష్మణ్ (ఫైల్)



డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కున్న లక్ష్మణ్

ఐనవోలు: ప్రమాదాన్ని తప్పించబోయి డీసీఎం డ్రైవర్ దుర్మరణం చెందిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పంథిని శివారు వరంగల్–ఖమ్మం రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్లకు చెందిన పేరం శ్యాంసుందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండ నుంచి కొడకండ్లకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పంథిని శివారుకు చేరుకుని అతివేగంతో టూవీలర్ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా సూర్యాపేట నుంచి వరంగల్ వైపునకు వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టడంతోపాటు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. అయితే వేగంగా ఓవర్ టేక్ చేస్తున్న కారును గమనించిన డీసీఎం డ్రైవర్ వేమ లక్ష్మణ్ ప్రమాదాన్ని నివారించాలని ప్రయత్నించి ఒక్కసారిగా డీసీఎం స్టీరింగ్‌ను ఎడమ వైపునకు తిప్పగా పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో డీసీఎం క్యాబిన్, స్టీరింగ్ మధ్య లక్ష్మణ్ ఇరుక్కుపోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ సాయంతో సుమారు అరగంట పాటు శ్రమించి డీసీఎం డ్రైవర్‌ను బయటకు తీశారు. 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ లక్ష్మణ్ మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న శ్యాంసుందర్‌తో పాటు బైక్‌పై వెళ్తున్న నల్లగొండకు చెందిన గోగుల రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు గంటపాటు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో అటు వైపుగా వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

దోనగుట్టపై చారిత్రక ఆధారాలు

- నవీన శిలాయుగానికి చెందినవిగా గుర్తింపు



సాక్షి ప్రతినిధి, వరంగల్ : హనుమకొండ జిల్లా శాయంపేట దోనగుట్ట(త్రివేదాద్రి)పై తొలిసారిగా నవీన శిలా యుగానికి చెందిన చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. చరిత్ర పరిశోధకుడు, డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి పాతూరి రఘురామయ్యతో కలిసి శాయంపేట గుట్టలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధనా వివరాలను రత్నాకర్‌రెడ్డి వివరించారు. దోనగుట్టపై శ్రీ సంతోష లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వెనుక వైపున సమతల ప్రాంతంలో నవీన శిలా యుగపు(గ్రూవ్స్)ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని బట్టి సుమారు ఐదువేల ఏళ్ల క్రితమే మానవులు ఇక్కడ రాతి పనిముట్లను తయారు చేసుకునే వారిని, వ్యవసాయం చేసేవారని తెలుస్తున్నట్లు తెలిపారు. ఆలయం వెనుక భాగంలో స్వయంభూ శివలింగం, తొలిచిన వామన గుంటలు, చాళుక్యుల నాటి వినాయక విగ్రహం ఉన్నాయన్నారు. ఆలయ సంరక్షకులు చారిత్రక ఆధారాలను తెలిపే వివరాలను భక్తులకు, పర్యాటకులకు అందుబాటులో ఉంచితే ఆలయ చారిత్రక విలువ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

విద్యుత్ షాక్‌తో లేజర్ మిషన్ ఆపరేటర్ మృతి

గీసుకొండ: విద్యుత్ షాక్‌తో కేఎంటీపీలో పని చేసే వలస కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో బిహార్‌కు చెందిన రాజేశ్ సా(33) లేజర్ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన తన డ్యూటీ ముగించుకుని రాత్రి గూడ్స్ ఆటో కడగడానికి కైటెక్స్ కంపెనీ పార్కు వద్ద ఉన్న బోరు వద్దకు వెళ్లాడు. మోటార్ స్టార్ట్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి కింద పడ్డాడు. గాయపడిన అతడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం మృతుడి బంధువు మదర్‌సా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి యువకుడు..

బచ్చన్నపేట : పొలం దున్నుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కట్కూర్‌లో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాక పద్మ, మల్లయ్య దంపతుల పెద్ద కుమారుడు లింగం (35) రోజు మాదిరిగా తమ స్వంత ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. ఈ సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో లింగం కింద పడగా అతడిపైనుంచి కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్ ముందుకు వెళ్లింది. గమనించిన చుట్టు పక్కల రైతులు వచ్చి లింగాన్ని లేపి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



లింగం (ఫైల్)

నీటి సంపులో పడి మహిళ..

రామన్నపేట : వరంగల్ పోచమ్మమైదాన్‌లో నివాసముంటున్న జన్ను లక్ష్మి (60) నీటి సంపులో పడి మృతి చెందింది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి కథనం ప్రకారం.. వంగపహాడ్‌కు చెందిన శారద తన కుమారుడు భిక్షపతితో కలిసి నగరంలోని పోచమ్మైదాన్‌లో నివసిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 80 ఫీట్ల రోడ్డులో టీ తాగడానికి వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులుగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మట్టెవాడ పీఎస్‌లో కూతరు శారద ఫిర్యాదు చేసింది. కాగా, సాయంత్రం లక్ష్మి మృతదేహాన్ని నీటి సంపులో గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

మడికొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్.. మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ శివారు ఇందిరమ్మ కాలనీకి చెందిన రాగుట్ల శంకర్ భార్య రాగుట్ల నాగమణి 6 నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో శంకర్ తన తల్లితోపాటు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన జవ్వా ఫాతిమా శనివారం తన పరీక్ష రాయడానికి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి సయ్యద్ కమిరున్నీసా ఆదివారం మడికొండ పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపారు.

సంకల్పం ముందు వైకల్యం చిన్నబోయింది

- దివ్యాంగతను జయించి దేశానికి ప్రాతినిధ్యం
- అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం



బంగారు పతకంతో రమాదేవి

సంగెం: సంకల్పం ముందు వైకల్యం చిన్నబోయింది. దివ్యాంగత శరీరానికే కాని మనసుకు కాదని నిరూపించింది ఓ క్రీడాకారిణి. సంకల్పబలంతో అసాధ్య లక్ష్యాన్ని సుసాధ్యం చేసింది. ఆమె వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లికి చెందిన దామెరుప్పుల రమాదేవి. వ్యవసాయ కుటుంబానికి చెందిన దామెరుప్పుల వరలక్ష్మి, వీరమల్లు దంపతుల మొదటి సంతానం రమాదేవికి ఆరు నెలల వయసులోనే జ్వరం వచ్చి కాళ్లు చచ్చుబడిపోయాయి. అందరిలా ఆడుకోవడం, నడవడం, పరిగెత్తడం సాధ్యం కాదని తెలిసినా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లింది. వైకల్యం జయించాలంటే చదువు ఒకటే మార్గమని చిన్నప్పటి నుంచి చక్రాల కుర్చీకే పరిమితమైన రమాదేవి.. 7వ తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. అనంతరం సంగెం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి , సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ హెచ్ఈసీ చదివింది. కాకతీయ యూనివర్సిటీలో బీఏ, పీజీ, య్యూమన్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (హెచ్ఎం ఆర్ఎం)లో పీహెచ్‌డీ చేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన పారా ఇంటర్నేషనల్ త్రోబాల్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన రమాదేవి కంబోడియా దేశానికి వెళ్లడానికి ఆర్థిక సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, ఎంపీ కడియం కావ్యకు వివరించడంతో వారు ఆర్థిక సాయం అందించారు. దీంతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. కాగా, దేశానికి గోల్డ్ మెడల్ సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచిన రమాదేవిని తల్లిదండ్రులు, గ్రామస్తులు, మండల ప్రజలు, అధికారులు అభినందించారు.

వరంగల్ మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

- జనవరి 3, 10, 5, 12న నాందేడ్–కొల్లాం సర్వీస్‌లు
- జనవరి 17, 24, 19, 26న కొల్లాం–సిర్‌పూర్ కాగజ్‌నగర్ సర్వీస్‌లు

కాజీపేట రూరల్ : వరంగల్ మీదుగా శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే నాలుగు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సర్వీస్ వివరాలు..

నాందేడ్– కొల్లాం (07159) వెళ్లే ఎక్స్‌ప్రెస్

నాందేడ్– కొల్లాం వెళ్లే ఎక్స్‌ప్రెస్ 2025 జనవరి 3, 10వ తేదీన నాందేడ్‌లో శుక్రవారం 05:30 గంటలకు బయలుదేరి వరంగల్‌కు 16:30 గంటలకు చేరుకొని శనివారం 19:00 గంటలకు కొల్లాం చేరుతుంది. అదేవిధంగా కొల్లాం–నాందేడ్ (07160) వెళ్లే ఎక్స్‌ప్రెస్ జనవరి 5, 12వ తేదీన కొల్లాంలో ఆదివారం 02:30 గంటలకు బయలుదేరి సోమవారం 06:30 గంటలకు వరంగల్‌కు చేరుకొని సోమవారం 15:30 గంటలకు నాందేడ్‌కు చేరుతుంది. ఈ రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ముద్కెడ్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు, రేణిగుంట, కట్‌పాడి, జోలర్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబొత్తూర్, పాలక్కడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకుళం టౌన్, ఇటుమన్నూర్, కొట్టాయం, చెంగన్‌చెరి, తిరువల్ల, చెంగనూర్, కాయన్‌కులంలో అప్ అండ్ డౌన్‌లో హాల్టింగ్ కల్పించారు.

సిర్‌పూర్‌కాగజ్‌నగర్–కొల్లాం (07161) వెళ్లే ఎక్స్‌ప్రెస్

2025 జనవరి 17, 24వ తేదీన సిర్పూర్ కాగజ్‌నగర్‌లో శుక్రవారం ఉదయం 10:40 గంటలకు బయలుదేరి వరంగల్‌కు 01:30 గంటలకు చేరుకొని శనివారం 19:00 గంటలకు కొల్లాంకు చేరుతుంది. అదేవిధంగా కొల్లాం–సిర్పూర్ కాగజ్‌నగర్ (07162) ఎక్స్‌ప్రెస్ జనవరి 19, 26వ తేదీన కొల్లాంలో ఆదివారం 02:30 గంటలకు బయలుదేరి సోమవారం వరంగల్‌లో 15:30 గంటలకు చేరుకొని 18:45 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చేరుతుంది. ఈ రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంచిర్యాల , రామగుండం, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చిరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కట్‌పాడి, జోలర్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకుళం, ఎటుమన్నూర్, కొట్టాయం, చెంగన్‌చెరి, తిరువల్లా, చెంగనూర్, కాయన్‌కులంలో అప్ అండ్ డౌన్‌లో హాల్టింగ్ కల్పించారు.

ఓటమి గెలుపునకు నాంది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు



హైదరాబాద్ జట్టుకు ఓవరాల్ చాంపియన్ షిప్ కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి: క్రీడల్లో ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజులపాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర 9వ శీతాకాల ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ –2024 ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేశ్, జిల్లా కార్యదర్శి మధన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ హైదరాబాద్ జట్టు

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో హైదరాబాద్ జట్టు అత్యధిక మెడల్స్ సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకోగా ద్వితీయ స్థానంలో రంగారెడ్డి నిలిచింది. గ్రూప్ –1 విభాగంలో డి. వర్షిత్ 5 గోల్డ్ మెడల్స్, అదితి నాదెళ్ల ఐదు గోల్డ్ మెడల్స్, గ్రూప్ –2 విభాగంలో సచిన్ సాత్విక్ 4 గోల్డ్, ఒక సిల్వర్, జోహన్న సిజు– 4 గోల్డ్, ఒక సిల్వర్, గ్రూప్ –3 విభాగంలో అబ్దుల్ హమీద్ ఇషాన్ –5 గోల్డ్, అభినయ జాహ్నవి –4 గోల్డ్ మెడల్స్ సాధించారు.